GSTIN-NO:36FKPSI308PIZX

epaper:tmedia.net.in

# టి-మీడియా

సామాజికం... ప్రజల పక్షం

మెయిన్

సంపుటి : 7 | సంచిక : 254 | ఎడిటర్ : శనగపాటి మురళీకృష్ణ | శుక్రవారం 14-03-2025 | పేజీలు : 3

## ఐదు ఎమ్మెల్సీ స్థానాలు ఏకగ్రీవం



**టి మీడియా, మార్చి 13, హైదరాబాద్ :**

రాష్ట్రంలో ఎమ్మెల్సీల ఎన్నిక ఏకగ్రీవమైంది. ఇవాళ్టితో ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ అభ్యర్థుల నామినేషన్ల ఉపసంహరణ గడువు ముగిసిన దృష్ట్యా ఐదు ఎమ్మెల్సీ స్థానాలకు ఐదుగురు అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. ఉపముఖ్యమంత్రి భట్టివిక్రమార్క, ఇతర మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు వెంట రాగా కాంగ్రెస్, సీపీఐ సభ్యులు ఈ నామినేషన్ల దాఖలు చేశారు. ఉపసంహరణ గడువు ముగియడంతో రిటర్నింగ్ అధికారి ఉపేందర్‌రెడ్డి అధికారిక ప్రకటన వెలువరించారు.కాంగ్రెస్ నుంచి విజయశాంతి, అద్దంకి దయాకర్, శంకర్ నాయక్, సీపీఐ నుంచి నెల్లకంటి సత్యం, బీఆర్ఎస్ నుంచి డాక్టర్ దాసోజు శ్రవణ్‌కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు రిటర్నింగ్ అధికారి ఉపేందర్‌రెడ్డి ప్రకటించారు. ఈ సందర్భంగా ఆ ఐదుగురు ఏకగ్రీవంగా ఎమ్మెల్సీలుగా ఎన్నికైనట్లు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. అనంతరం ఏకగ్రీవంగా ఎన్నికైన కొత్త ఎమ్మెల్సీలకు మంత్రులు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు శుభాకాంక్షలు తెలియజేశారు.

# ఫొటోలు చూపించుకోవాల్సిన అవసరం లేదు

- ఎవరి ట్రాప్‌లో పడలేదు
- గాంధీ కుటుంబంతో మంచి అనుబంధం
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

**టి మీడియా,మార్చి 13,ఢిల్లీ బ్యూరో:**

గాంధీ కుటుంబంతో తనకు మంచి అనుబంధముందని, ఫొటోలు దిగి చూపించుకోవాల్సిన అవసరం లేదని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. తాను ఎవరో తెలియకుండానే పీసీసీ అధ్యక్షుడిగా, సీఎంగా ఎంపిక చేశారా అంటూ ప్రశ్నించారు. తాను ఎవరి ట్రాప్‌లో పడనని స్పష్టం చేశారు. గవర్నర్ ప్రసంగానికి కేసీఆర్ రావడం కాదు, అసెంబ్లీలో చర్చలకు రావాలని సీఎం సవాల్ విసిరారు. డీలిమిటేషన్ అనేది లిమిటేషన్ ఫర్ సౌత్ అని ధ్వజమెత్తారు. ఢిల్లీలో మీడియా ప్రతినిధులతో సీఎం రేవంత్ రెడ్డి చిట్‌చాట్ నిర్వహించారు. రాష్ట్రానికి సంబంధించిన అంశాలు సాధించుకురావాలని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిని ప్రశ్నిస్తున్నానని సీఎం రేవంత్ రెడ్డి సవాల్ చేశారు. రాష్ట్రానికి రావాల్సినవి కిషన్ రెడ్డి పట్టించుకోవట్లేదన్నారు. ప్రధాని, కేంద్రమంత్రులు ప్రకటించిన హామీలు అడుగుతున్నామని అన్నారు. రీజినల్ రింగ్ రోడ్డు, మెట్రో విస్తరణ, కేంద్ర ప్రాజెక్టులే ఇవ్వాలని అడుగుతున్నామని తెలిపారు. మెట్రోకి కేంద్ర కేబినెట్ అనుమతి ఇస్తే పనులు



ప్రారంభానికి సిద్ధంగా ఉన్నామని వెల్లడించారు. మెట్రో విస్తరణ హైదరాబాద్ గేమ్ ఛేంజర్ అని హర్షించారు. పన్ను వసూళ్లలో

**తెలంగాణ అగ్రస్థానం :**

10 ఏళ్లలో కేసీఆర్ ఒక్క కొత్త పాలసీ కూడా తీసుకురాలేదని సీఎం రేవంత్ రెడ్డి ధ్వజమెత్తారు. నిరుద్యోగాన్ని 8.8 శాతం నుంచి 6.1 శాతానికి తగ్గించామన్నారు. రూ.2.2 లక్షల కోట్ల పెట్టుబడులు తెలంగాణకు తెచ్చామని వివరించారు. పన్ను వసూళ్లలో తెలంగాణ ముందంజలో ఉందన్నారు.

**భారత్ సమ్మిట్ కార్యక్రమం**

తెలంగాణలో భారత్ సమ్మిట్ పేరిట ఓ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమానికి సుమారు 60 దేశాల నుంచి ప్రతినిధులను ఆహ్వానిస్తున్నామన్నారు. ఈ సమ్మిట్‌కు అమెరికా మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామా తదితరులు హాజరయ్యే అవకాశం ఉందని చెప్పారు. భారత్ సమ్మిట్‌కు కేంద్ర ప్రభుత్వం క్లియరెన్స్? ఇవ్వాల్సి ఉంటుందని ఆ విషయంపైనే విదేశాంగ మంత్రి జైశంకర్‌ను కలుస్తున్నట్లు సీఎం తెలిపారు. అలాగే హైదరాబాద్‌లో మిస్ ఇండియా పోటీలు జరగనున్నాయని నెలరోజుల పాటు దీనికి సంబంధించిన కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. దీనికోసం రెండు రోజుల్లో అధికారులతో కమిటీని ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు.

## తెలంగాణ రైజింగ్ విజన్‌కు మద్దతు

### కేంద్రమంత్రి సుబ్రహ్మణ్యం జయశంకర్‌ని కల్సిన సీఎం రేవంత్

### పలు విషయాలు పై వినతి

**టి మీడియా,మార్చి 13,ఢిల్లీ బ్యూరో:**



రాబోయే 25 ఏండ్ల పాటు తెలంగాణ రైజింగ్ విజన్‌ను సమున్నతంగా నిలిపేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలకుమద్దతు నివ్వాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి సుబ్రహ్మణ్యం జయశంకర్ ని కోరారు. ఢిల్లీలో కేంద్ర మంత్రి గారితో ముఖ్యమంత్రి భేటీ అయ్యారు. ఈ ఏడాది హైదరాబాద్‌లో ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న అంతర్జాతీయ కార్యక్రమాలైన మిస్ వరల్డ్ పోటీలు, గ్లోబల్ డీప్ టెక్ సదస్సు, భారత్ సమ్మిట్ ఈవెంట్లు, యానిమేషన్ గేమింగ్, వీఎఫ్ఎక్స్‌తో పాటు వినోద పరిశ్రమలో తెలంగాణ బలాన్ని చాటే ఇండియా జాయ్ వంటి వేదికల వివరాలను ముఖ్యమంత్రి కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. దౌత్య సహకారంతో జరిగే ఈ గ్లోబల్ ఈవెంట్స్ విజయవంతం అయ్యేలా సహకరించాలని విజ్ఞప్తి చేశారు. విదేశాల్లో నిర్వహించే భారత కార్యక్రమాల్లోనూ తెలంగాణ రైజింగ్‌కు తగినంత ప్రచారం, ప్రాధాన్యం కల్పించాలని విన్నవించారు. ముఖ్యమంత్రి అభ్యర్థన పట్ల విదేశాంగ శాఖ మంత్రి జైశంకర్ గారు సానుకూలంగా స్పందించారు. అభివృద్ధి చెందుతున్న రాష్ట్రాల్లో తెలంగాణ ప్రధానంగా ఉందని, అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరంగా ప్రపంచం దృష్టిని ఆకర్షిస్తోన్న హైదరాబాద్ నగరంలో చేపట్టే కార్యక్రమాలకు విదేశీ వ్యవహారాల శాఖ మద్దతు ఇస్తుందని కేంద్ర మంత్రి గారు తెలియజేశారు. కేంద్ర మంత్రి జైశంకర్ తో జరిగిన భేటీలో ముఖ్యమంత్రి వెంట కేంద్ర మాజీ మంత్రి సల్మాన్ ఖుర్షీద్ గారు, ఎంపీలు అనిల్ కుమార్ యాదవ్ గారు, డాక్టర్ మల్లు రవి గారు, చామల కిరణ్ కుమార్ రెడ్డి ఉన్నారు.

## 22న సమావేశానికి రావాలి

### సీఎం రేవంత్‌కు సీఎం స్టాలిన్ ఆహ్వానం

**టి మీడియా, మార్చి 13, హైదరాబాద్:**



లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజనతో వాటిల్లే నష్టాలపై చర్చించేందుకు ఉద్దేశించిన సమావేశానికి రావాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డినికి తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఢిల్లీలో సీఎం రేవంత్‌ను తమిళనాడు మంత్రి టీకే నెహ్రూ ఆధ్వర్యంలోని డీఎంకే ప్రతినిధి బృందం కలిసి, స్టాలిన్ తరఫున ఈ ఆహ్వానం అందించింది. నియోజకవర్గాల పునర్విభజనతో దక్షిణాది రాష్ట్రాలకు వాటిల్లే నష్టం చర్చించేందుకు ముఖ్యమంత్రులు, మాజీ ముఖ్యమంత్రులతో ఈ నెల 22న స్టాలిన్ సమావేశం ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. లోక్ సభ నియోజకవర్గాల పునర్వ్యవస్థీకరణ అంశంపై ఏపీ, తెలంగాణతో పాటు కేరళ, కర్ణాటక, పశ్చిమ బెంగాల్, పంజాబ్ రాష్ట్రాల ముఖ్యమంత్రులు, రాజకీయ పార్టీల అధినేతలను స్టాలిన్ అఖిలపక్ష సమావేశానికి ఆహ్వానిస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ నేతృత్వంలోని ఇండియా కూటమి పార్టీలతో పాటు ఎన్డీయే కూటమిలో ఉన్న ప్రాంతీయ పార్టీలకు, ఏ కూటమిలో లేని తటస్థ పార్టీలకు కూడా స్టాలిన్ ఆహ్వానాలు పంపారు.

## అసెంబ్లీ నుంచి జగదీష్‌రెడ్డి సస్పెన్షన్

**టి మీడియా, మార్చి 13, హైదరాబాద్ బ్యూరో :**

స్పీకర్ నిర్ణయం తీసుకున్నారు. స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశారని చర్యలు తీసుకున్నారు. జగదీష్ రెడ్డి వ్యాఖ్యలు స్పీకర్‌ను కించపరిచేలా ఉన్నాయంటూ అధికార పార్టీ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేయడంతో రాజకీయం ఒక్కసారిగా వేడెక్కింది. ఈ పరిణామాలతో స్పీకర్ సభను వాయిదా వేశారు. సభ వాయిదా అనంతరం బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు స్పీకర్‌ను ఆయన ఛాంబర్‌లో కలిశారు. స్పీకర్ ప్రజాస్వామ్యబద్ధంగా పనిచేయాలన్నారు మాజీమంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నేత హరీష్‌రావు. స్పీకర్‌ను జగదీష్‌రెడ్డి అవమానించలేదన్నారు. సభ మీ ఒక్కరిది కాదు..అందరిది అని మాత్రమే జగదీష్ రెడ్డి అన్నారని.. మీ అనే పదం సభ నిబంధనలకు విరుద్ధం కాదని కామెంట్ చేశారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఎందుకు నిరసన చేశారో తెలీదని.. సభను ఎందుకు వాయిదా వేశారో అర్థంకావడం లేదన్నారు.ఇదిలా ఉంటే తెలంగాణ స్పీకర్‌తో పలువురు మంత్రులు సమావేశమయ్యారు. సభలో జరిగిన అంశంపై ఆయనతో చర్చించారు. జగదీష్‌రెడ్డి బేషరతుగా క్షమాపణ చెప్పాలని అధికార పార్టీ డిమాండ్ చేస్తున్న తరుణంలో ఈ భేటీ ప్రాధాన్యత సంతరించుకుంది. అంతకుముందు సభలో జగదీష్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపాయి. సభ మీ సొంతం కాదని స్పీకర్‌ను ఉద్దేశించి అన్నారు జగదీష్‌రెడ్డి. ఆయన వ్యాఖ్యలపై అధికార పక్షం ఆగ్రహం వ్యక్తం చేసింది. స్పీకర్‌కు క్షమాపణ



చెప్పాలని డిమాండ్ చేసింది. ఈ పరిణామంతో సభలో అధికార, విపక్ష సభ్యుల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. స్పీకర్ అధికారాలు, సభ్యుల హక్కులు ఏంటో తేలాలని.. సభా సంప్రదాయాలు ఏంటో తేలాకే మాట్లాడతానని జగదీష్ రెడ్డి అన్నారు. దళిత స్పీకర్‌ను జగదీష్ అవమానించారని ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మండిపడ్డారు. జగదీష్‌రెడ్డి వెంటనే క్షమాపణ చెప్పాలన్నారు. ఆయనను సస్పెండ్ చేయాలన్నారు.మరోవైపు ఈ అంశంపై ఢిల్లీలో ఉన్న సీఎం రేవంత్‌తో మంత్రి శ్రీధర్‌బాబు చర్చలు జరిపారు. అసెంబ్లీలో జరిగిన పరిణామాలను సీఎం దృష్టికి తీసుకెళ్లారు. స్పీకర్‌పై జగదీష్‌రెడ్డి వ్యాఖ్యలకు తదుపరి కార్యాచరణపై సీఎంతో చర్చించారు. అటు స్పీకర్ గడ్డం ప్రసాద్‌తో భట్టి విక్రమార్క భేటీ అయ్యారు.

## రూ.1.21లక్షల కోట్ల పెట్టుబడులకు ఆమోదం

- సీఎం చంద్రబాబు అధ్యక్షతన ఎస్ఐపీబీ సమావేశం
- 80,104 మందికి ఉద్యోగాలు

**టి మీడియా, మార్చి 13, అమరావతి:**

రాష్ట్రానికి పెట్టుబడుల విషయంలో ఒప్పందం చేసుకున్న పరిశ్రమలు వెంటనే గ్రౌండ్ అయ్యేలా చర్యలు తీసుకోవాలని సీఎం చంద్రబాబు అధికారులను ఆదేశించారు. సీఎం అధ్యక్షతన అసెంబ్లీలోని ఆయన ఛాంబర్‌లో నాలుగవ ఎస్ఐపీబీ సమావేశం నిర్వహించారు. ఇప్పటికే ఆమోదం తెలిపిన, ఒప్పందాలు చేసుకున్న ప్రాజెక్టుల పురోగతిపై నిత్యం పరిశీలించాలని దీని కోసం ట్రాకర్‌ను ఏర్పాటు చేసి పర్యవేక్షించాలని ఆదేశించారు. రాష్ట్రానికి కొత్తగా వస్తున్న పెట్టుబడుల ప్రతిపాదనలను పరిశీలించారు.పరిశ్రమలు, విద్యుత్, పర్యాటకం వంటి రంగాల్లో మొత్తం 10 సంస్థలు రూ.1,21,659 కోట్లు పెట్టుబడులు ముందుకురాగా ఎస్ఐపీబీ సమావేశంలో ఆమోదం తెలిపారు. వీటి ద్వారా 80,104 మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కలగనున్నాయి. రాష్ట్రంలో ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో ఎంఎస్ఎంఈ పార్కులు ఏర్పాటు చేయాలని అధికారులను చంద్రబాబు ఆదేశించారు. ఇందులో భాగంగా మొదట జిల్లాకు ఒకటి చొప్పున 26 జిల్లాల్లో తక్షణం ఈ పార్కులు నెలకొల్పేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఇప్పటికే ప్రతిపాదించిన రతన్ టాటా ఇన్నోవేషన్ కేంద్రాలను నెలరోజుల్లోగా రాష్ట్రంలోని 5 ప్రాంతాల్లో నెలకొల్పాలని చెప్పారు.

**పెట్టుబడులకు ఆమోదం**

మొత్తం 10 సంస్థల ప్రతిపాదనలకు ఎస్ఐపీబీ సమావేశం ఆమోదం తెలిపింది. నాయుడుపేటలో రూ.1,742 కోట్ల పెట్టుబడితో 2,000 ఉద్యోగాలు కల్పించే ప్రీమియర్ ఎనర్జీస్ లిమిటెడ్?ను ఏర్పాటు చేయనున్నారు. కడప జిల్లాలో రూ.2,883 కోట్ల పెట్టుబడులు నెలకొల్పనున్న దాల్మియా సిమెంట్?కు ఆమోదముద్ర వేశారు. ఈ సంస్థ ద్వారా 354 ఉద్యోగాల కల్పన జరగనుంది. విశాఖపట్నం రూ.1,500 కోట్ల పెట్టుబడితో లులూ గ్లోబల్ ఇంటర్నేషనల్ ఏర్పాటుకు పచ్చజెండా ఊపారు. శ్రీసిటీలో రూ.25,000 కోట్ల పెట్టుబడి, 50,000 ఉద్యోగాలు కల్పించే సత్యవీడు రిజర్వ్ ఇన్?ఫ్రా సిటీ ప్రైవేట్ లిమిటెడ్?కు ఆమోదం తెలిపింది. దాదాపు రూ.58,469 కోట్ల పెట్టుబడి, 13,050 ఉద్యోగాలిచ్చే ఇండోసాల్ సోలార్ ప్రైవేట్ లిమిటెడ్?కు ఆమోదముద్ర వేశారు.దాదాపు రూ.1,175 కోట్ల పెట్టుబడితో 1,500 ఉద్యోగాలు కల్పించే బాలాజీ యాక్షన్ బిల్డ్‌వెల్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ఏర్పాటు చేయనున్నారు. అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల్లో ఏపీ ఎన్జీఈఎల్ హరిత్ అమ్రిత్ లిమిటెడ్ సంస్థ



రూ.22,000 కోట్ల పెట్టుబడితో 8,300 ఉద్యోగాలు కల్పించనుంది. అన్నమయ్య, కడప జిల్లాల్లో రూ.8,240 కోట్ల పెట్టుబడితో 4,000 ఉద్యోగాలు కల్పించేలా ఆస్ట్రాగ్రీన్ ఎనర్జీ వెంచర్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సంస్థను ఏర్పాటు చేయనున్నారు. దాదాపు రూ.400 కోట్ల పెట్టుబడితో 750 ఉద్యోగాలతో మేఫెయిర్ బీచ్ రిసార్ట్స్, కన్వెన్షన్?ను ఏర్పాటు చేయనుంది. రూ.250 కోట్ల పెట్టుబడులు, 150 ఉద్యోగాల కల్పన లక్ష్యంగా ఒబేరాయ్ విలాస్ రిసార్ట్ ఏర్పాటుకు ఆమోదముద్ర వేశారు.

**గత మూడు ఎస్ఐపీబీ సమావేశాలు**

మొదటి ఎస్ఐపీబీ సమావేశంలో విద్యుత్ రంగంలో రూ.11,902 కోట్లు, ఇతర రంగాల్లో రూ.72,085 కోట్ల పెట్టుబడికి ఆమోదం తెలిపింది. దీంతో రూ.29,585 మందికి ఉద్యోగ అవకాశాలు రానున్నాయి. రెండవ ఎస్ఐపీబీ సమావేశంలో విద్యుత్ రంగంలో రూ.83,000 కోట్లు, ఇతర రంగాల్లో రూ.99,162 కోట్లు మొత్తం రూ.1,82,162 కోట్ల పెట్టుబడులు వచ్చాయి. ఈ పెట్టుబడులతో 2,63,411 మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నారు. మూడవ ఎస్ఐపీబీ సమావేశంలో విద్యుత్ రంగంలో రూ.42,932 కోట్లు, ఇతర రంగాల్లో రూ.1,844 కోట్లు మొత్తం రూ.44,776 కోట్ల పెట్టుబడులకు ఆమోదం తెలపగా వీటి రాకతో 19,580 ఉద్యోగాలు లభిస్తాయి. ఇప్పటివరకు నాలుగు ఎస్ఐపీబీ సమావేశాల్లో దాదాపు రూ.4,32,584 కోట్ల పెట్టుబడులకు ఆమోదం తెలిపారు. వీటి ద్వారా మొత్తం 3,92,680 మందికి ఉద్యోగాలు దక్కనున్నాయి.

## మాజీ మంత్రి జనార్ధన్ రెడ్డికి సిఎం చంద్రబాబు ఆత్మీయ పలకరింపు

**టి మీడియా, మార్చి 13, అమరావతి:**

తెలుగుదేశం పార్టీలో సుదీర్ఘ కాలం పనిచేసిన సీనియర్



నేత, మాజీ మంత్రి నాగం జనార్ధన్ రెడ్డి ఎపి సిఎం చంద్రబాబు నాయుడును అసెంబ్లీలో కలిశారు. చాలాకాలం తరువాత తనను కలిసిన నాగంను సీఎం చంద్రబాబు ఆప్యాయంగా పలకరించారు. నాగం గారూ ఎలా ఉన్నారు.. ఆరోగ్యం ఎలా ఉంది.. చాలా రోజులు అయ్యింది కలిసి అంటూ పలకరించారు. పిల్లలు ఏం చేస్తున్నారు అని ఆరా తీశారు. నాగం కుటుంబ యోగక్షేమాలు తెలుసుకున్న చంద్రబాబు ఆరోగ్యం కాపాడుకోవాలని ఆయనకు సూచించారు. ఓబులాపురం మైనింగ్ అంశంలో ఉమ్మడి రాష్ట్రంలో తెలుగుదేశం నేతలు చేసిన ఉద్యమాలపై నాడు కేసులు నమోదు అయ్యాయి. ఆ కేసుల విచారణలో భాగంగా విజయవాడ ప్రజాప్రతినిధుల కోర్టుకు నాగం జనార్ధన్ రెడ్డి గురువారం హాజరయ్యారు. ఈ సందర్భంగా జనార్ధన్ రెడ్డి అసెంబ్లీలోని సీఎం ఛాంబర్‌లో చంద్రబాబును మర్యాదపూర్వకంగా కలిశారు. ఆనాటి కేసులను ఎట్టకేలకు కొట్టివేయడంపై చంద్రబాబు హర్షం వ్యక్తంచేశారు. భేటీ సందర్భంగా ఇరువురు నేతలు పలు పాత ఘటనలను గుర్తుచేసుకున్నారు. ఉమ్మడి రాష్ట్రంలో నాడు చేసిన ప్రజా పోరాటాలను గురించి చర్చించుకున్నారు. నాగం ఫైర్ బ్రాండ్‌గా ఉండేవారని.పార్టీ ఆదేశిస్తే దూసుకుపోయేవాళ్లని ఈ సందర్భంగా సీఎం అన్నారు. ఎంతో ఎమోషన్‌గా ఉండేవారంటూ నాటి ఘటనలను ప్రస్తావించారు. నాలుగవసారి ముఖ్యమంత్రిగా చంద్రబాబును చూడడం తనకు ఎంతో సంతోషాన్ని ఇచ్చిందని నాగం ఈ వ్యాఖ్యానించారు. రెండు తెలుగు రాష్ట్రాలు బాగుండాలి తెలుగు ప్రజలు అన్ని రంగాల్లో విజయాలు సాధించాలనేదే తన అభిమతమని సీఎం చంద్రబాబు ఈ సందర్భంగా అభిప్రాయపడ్డారు.

## మేడిగడ్డ నిర్మాణం, నాణ్యత అన్నీ వైఫల్యాలే

3లో..

